నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
3 | నిజామాబాద్ సోమవారం 10 జూన్ 2024 | ADILABAD NIRMAL

## తీరిన కన్నీటి కష్టాలు


బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఉచిత మంచినీటి ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న కజ్జర్ల గ్రామస్తులు

తాంసి(తలమడుగు), జూన్ 9 : తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామంలో 'కన్నీటి కష్టాల'పై నమస్తే తెలంగాణలో ఆదివారం ప్రచురితమైన కథనానికి గ్రామ పంచాయతీ అధికారులతోపాటు బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, మాజీ సర్పంచ్ మొట్టె కిరణ్ కుమార్ స్పందించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశానుసారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంచినీటి పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. గ్రామస్తులకు తాగు నీటికి ఇబ్బందులు కలుగకుండా ట్యాంకర్ సహాయంతో నీళ్లు అందించారు. దీంతో గ్రామస్తుల సమస్య పరిష్కారం కావడంతో 'నమస్తే తెలంగాణ' యాజమాన్యానికి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## పోటీల్లో పాల్గొనే అలవాటు చేసుకోవాలి..

**జిల్లా గిరిజన క్రీడల శాఖ అధికారి పార్థసారథి**


ప్రశంసాపత్రాలు అందుకున్న వారితో పార్థసారథి

ఎదులాపురం, జూన్ 9 : విద్యార్థి దశ నుంచే పోటీల్లో పాల్గొనే అలవాటు చేసుకోవాలని జిల్లా గిరిజన క్రీడల శాఖ అధికారి పార్థసారథి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో కేకే అకాడమీ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డితో కలిసి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోటీల్లో గెలుపోటములు సహజం అని, దీంతో విద్యార్థుల్లో స్నేహభావం పెరుగుతుందన్నారు. అనంతరం పోటీల్లో గెలుపు పొందిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలతోపాటు మెడల్స్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో కేకే అకాడమీ నిర్వాహకుడు కృష్ణ, కోచ్‌లు చంద్రకాంత్, వంశీ, కార్తీక్, శ్రీను, రాజు, గౌరవ్, ఉదయ్, చరణ్ ఉన్నారు.

# గ్రూప్-1 ప్రశాంతం

● ప్రిలిమినరీ పరీక్షకు 5,469 మంది హాజరు ● కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ రాజర్షి షా


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా


కేంద్రం గేటు వద్ద బందోబస్తును పరిశీలిస్తూ సూచనలు చేస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, జూన్ 9 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షకు 6,729 మంది అభ్యర్థులకు 5,469 మంది హాజరు కాగా 1,260 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఉదయం పది గంటలలోపే పరీక్ష గదుల్లోకి అనుమతించారు. ఉదయమే కేంద్రాల వద్దకు చేరుకున్న అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్లను సరిచూసుకున్నారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్ రాజర్షి షాతోపాటు ఎస్పీ గౌష్ ఆలం కూడా కేంద్రాలను పరిశీలించారు. పరిస్థితులను పర్యవేక్షిస్తూ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రూప్-1 పరీక్ష ప్రశాంతంగా ముగిసేలా అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ.. పరీక్షకు పటిష్ట బందోబస్తు చేపట్టినట్లు తెలిపారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు సత్యనారాయణ, అశోక్, ఫణిధర్, ప్రణయ్‌కుమార్ ఉన్నారు.

### నిర్మల్ జిల్లాలో 3,633 మంది హాజరు

నిర్మల్ అర్బన్, జూన్ 9 : నిర్మల్ జిల్లా కేంద్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను అధికారులు ప్రశాంతంగా నిర్వహించారు. అధికారులు 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 4,608 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 3,633 మంది అభ్యర్థులు హాజరు కాగా 975 మంది గైర్హాజరయ్యారు. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో అభ్యర్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకున్నారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు వెనుదిరిగి వెళ్లారు. నిర్మల్‌లో పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తనిఖీ చేశారు. సమన్వయ కర్త పీజీ రెడ్డి పాల్గొన్నారు.


హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు


కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్


నిర్మల్ జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి అధికారులకు సూచనలిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్(ఫైల్)

# ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

**నిర్మల్ జిల్లాలో 228 కేంద్రాల ద్వారా 1.58 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ**

● 38,113 మంది రైతుల నుంచి రూ.313.78 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు

● 29,990 మంది రైతుల ఖాతాల్లో రూ.271 కోట్లు జమ ● పది రోజుల్లో మిగతా వారి ఖాతాల్లోకి..

నిర్మల్, జూన్ 9(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగిసింది. 19 మండలాల పరిధిలోని 228 కొనుగోలు కేంద్రాల ద్వారా 1.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న కొనుగోళ్లను ప్రారంభించగా, ఈనెల 8వ తేదీతో ముగిశాయి. యాసంగిలో 1.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. అంచనాకు మించి మరో 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా వచ్చింది. ఇందులో గ్రేడ్-ఏ, సాధారణ రకం వడ్లు కలిపి 1,58,071.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. 38,113 మంది అన్నదాతల నుంచి రూ.313 కోట్ల విలువ చేసే వడ్లను కొనుగోలు చేశారు. డీఆర్డీఏ 54 కేంద్రాల ద్వారా 6,789 మంది రైతుల నుంచి 24,288.640 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్ 92 కేంద్రాల ద్వారా 17,043 మంది రైతుల నుంచి 67,996.200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అలాగే డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ప్రారంభించిన 77 కొనుగోలు కేంద్రాల ద్వారా 13,921 మంది రైతుల నుంచి 64,407.880 మెట్రిక్ టన్నులు, జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాల ద్వారా 366 మంది రైతుల నుంచి 1,379.240 మెట్రిక్ టన్నులు సేకరించారు. సేకరించిన ధాన్యాన్ని అధికారులు ఇప్పటికే పూర్తి స్థాయిలో మిల్లులకు తరలించారు. ఇందులో 29,990 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.271 కోట్లను జమ చేశారు. మిగిలిన వారికి వచ్చే వారం, పది రోజుల్లో డబ్బులు జమ చేయనున్నారు. జిల్లాను మూడు సెక్టార్లుగా విభజించి, ఏ రోజు కొన్న ధాన్యాన్ని ఆ రోజునే కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించారు. రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్ కేంద్రాలను సందర్శించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని మిల్లుల్లో స్థలం సరిపోక పోవడంతో సమీప జిల్లాల్లో గల మిల్లులకు ధాన్యాన్ని తరలించారు. రైతులు ధాన్యం అమ్మిన తర్వాత వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి చెల్లింపులు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

### పారదర్శకంగా కొనుగోళ్లు పూర్తి చేశాం..

**- కిశోర్‌కుమార్, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్, నిర్మల్.**

యాసంగి సీజన్‌కు సంబంధించి ఎక్కడా ఇబ్బంది లేకుండా కొనుగోళ్లను పూర్తి చేశాం. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాం. ఈ వారంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని కేంద్రాల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఇప్పటికే మిల్లులకు తరలించాం. కేంద్రాల్లో అవకతవకలు జరుగకుండా పూర్తి పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేశాం.




స్మగ్లర్లు నరికివేయగా మిగిలిన చెట్ల మొదళ్లు

# అడవి తల్లిపై గొడ్డలి వేటు

● విచ్చల విడిగా చెట్లను నరికివేస్తున్న స్మగ్లర్లు
● అధికారుల కనుసన్నల్లోనే కలప అక్రమ రవాణా

*'అడవుల రక్షణకు ఉక్కుపాదం మోపుతాం.. అక్రమార్కులపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తాం' అని అధికారులు ప్రగల్భాలు పలుకుతున్నారే తప్పా చర్యలు తీసుకోవడం లేదు. బజార్‌హత్నూర్ మండలంలో గొడ్డలి వేటుకు వందల సంఖ్యలో పచ్చని చెట్లు నేలకొరుగడమే నిదర్శనం. స్మగ్లర్లు చెట్లను నరికి కలపను సరిహద్దులు దాటిస్తున్నారు. ఇదంతా కూడా అటవీ శాఖలోని ఓ అధికారి కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటవీ ప్రాంతంలో రోజువారీగా విధులు నిర్వహించే బీట్ అధికారులు ఎక్కడ ఏ చెట్టు నరికారో గుర్తించి ఆ మరుసటి రోజే మిస్సింగ్ అని ఆ చెట్టుకు నంబర్ వేయాలి. కానీ.. అవేమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి అక్రమంగా కలపను రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని, అడవిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.*

*- బజార్‌హత్నూర్, జూన్ 9*


బజార్‌హత్నూర్ మండలంలోని అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు నరికివేయగా మిగిలిన చెట్ల మొదళ్లు


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న చిరు వ్యాపారస్తులు

# వ్యాపారుల రాస్తారోకో

**వారసంతకు వారానికో స్థలం కేటాయించడంపై ఆందోళన**

● మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా
● తమకు శాశ్వత స్థలం చూపించాలని డిమాండ్
● చైర్మన్, మున్సిపల్ అధికారుల తీరుపై అసంతృప్తి

ఖానాపూర్, జూన్ 9 : ఖానాపూర్ పట్టణంలో ప్రతి బుధ, ఆదివారాల్లో కొనసాగే వారసంత స్థలం మార్చడంపై చిరు వ్యాపారులు ఆందోళనకు దిగారు. మున్సిపల్ చైర్మన్, అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. రెండు వారాలుగా ప్రభుత్వ దవాఖాన పక్కన గల రోడ్డుతోపాటు అంగడి బజార్‌లో వారసంత కొనసాగించాలని మార్కింగ్ చేసి చిరు వ్యాపారస్తులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం దవాఖాన పక్కన గల రోడ్డులో కూరగాయల విక్రయాలు జరుపుదామనుకుంటే మున్సిపల్ సిబ్బంది వాహనాలను అడ్డుగా పెట్టారు. దీంతో ఒక్కసారిగా ఆగ్రహించిన రైతులు, చిరు వ్యాపారులు చైర్మన్ డౌన్, డౌన్ అంటూ నినాదాలు చేస్తూ గంటపాటు ధర్నా చేశారు. మున్సిపల్ పాలకవర్గం, అధికారుల తీరుపై మండిపడుతూ వ్యాపారస్తులకు సరైన స్థలం చూపించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. తైబజార్ పన్నులు చెల్లించినప్పటికీ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమీకృత మార్కెట్ పనులను త్వరగా పూర్తి చేసి మాలాంటి చిరు వ్యాపారులకు అందుబాటులోకి తీసుకొస్తే మేలు జరుగుతుందన్నారు. అప్పుడే రోడ్లపై వ్యాపారం చేసే వారి బాధలు తొలుగుతాయని ప్రజలకు కూడా ఒకే చోట కూరగాయలు, మాంసం, పూలు, పండ్లు లభించడంతో వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో ఘటన స్థలానికి ఎస్ఐ లింబాద్రి చేరుకుని సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. ఇందులో పలు గ్రామాలకు చెందిన రైతులు, చిరు వ్యాపారస్తులు ఉన్నారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న చిరు వ్యాపారస్తులు


## నమస్తే తెలంగాణ

## విలేకరులు కావలెను

**అర్హతలు :**

- పాత్రికేయులుగా పనిచేయాలన్న ఉత్సాహం.
- మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన.
- తెలుగు భాషపై పట్టు ఉండి.. చక్కగా రాయగలగాలి.
- ఇంటర్ ఉత్తీర్ణత సాధించి.. 30 ఏళ్లలోపు ఉండాలి.
- రిపోర్టింగ్‌పై ఆసక్తి ఉన్నవారురాత పరీక్ష, ఆ తర్వాత ఇంటర్వ్యూలకు హాజరుకావాలి.
- బయోడాటాతో రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు తెచ్చుకోగలరు.
- తెలుగు టైపింగ్ వచ్చిన వారికి ప్రాధాన్యం.

**నిర్మల్‌కు కావలసిన కేంద్రాలు**
1. నిర్మల్ టౌన్ 2. నిర్మల్ శివాజీచౌక్ 3. మామడ

**ఆదిలాబాద్‌కు కావలసిన కేంద్రాలు**
1. ఆదిలాబాద్ టౌన్ 2. ఆదిలాబాద్ రూరల్ 3. మావల
4. ఉట్నూర్‌టౌన్ 5. తలమడుగు 6. జైనథ్ రూరల్

రాతపరీక్ష తేదీ : 11-06-2024 (మంగళ వారం)
సమయం : ఉదయం 11 గంటలకు..
నిర్మల్ పరీక్షా స్థలం : వశిష్ట డిగ్రీ కళాశాల, భాగ్యనగర్ కాలనీ, భైంసా రోడ్, నిర్మల్
ఆదిలాబాద్ పరీక్షా స్థలం : టీఎన్‌జీవో భవన్, ఆదిలాబాద్
ఫోన్ నంబర్లు : 94403 83136, 9182777993, 9182777029




# వాగంతా గుర్రపు నాడ

▲ చందా(టీ) వాగును కప్పేసిన గుర్రపు నాడ

*ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాంద(టీ) వాగును గుర్రపు నాడ కప్పేసింది. రోడ్డుపై నుంచి వెళ్లే పాదచారులు, వాహనదారులను కనువిందు చేస్తున్నది. వాగులోని నీరంతా గుర్రపు నాడతో కప్పేయబడింది. కనుచూపు మేర పచ్చదనంతో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది.*

*- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, జూన్ 9*



# ప్రైవేట్ ఎలక్ట్రీషన్ దుర్మరణం

**నాలుగు గంటలపాటు విద్యుత్ స్తంభంపైనే మృతదేహం**

ఎదులాపురం, జూన్ 9 : ఆదిలాబాద్ జిల్లాలో ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషన్ మృతి చెందిన ఘటన ఉద్రికత్తకు దారితీసింది. ఆయన కుటుంబానికి న్యాయం చేయాలంటూ విద్యుత్ స్తంభం నుంచి సుమారు నాలుగు గంటలపా టు మృతదేహాన్ని కిందికి దించనివ్వకుండా గ్రామస్తులు ఆందోళనకు దిగారు. స్థానికులు తెలిపి న వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మోతీరాం(35) కొంతకాలం క్రితం విద్యుత్ లైన్‌మన్ వద్ద పనిచేసి మానేశాడు. తాజాగా ఆదివారం విద్యుత్ మరమ్మతుల కోసం స్తంభం ఎక్కాడు. ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో ఆయన స్తంభం పైనే మృతి చెందాడు. అయితే మృతి చెంది న మోతీరాం కుటుంబ సభ్యులను ఆదుకోవాలని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. అధికారులు స్ప ష్టమైన హామీ ఇచ్చేంత వరకు మృతదేహాన్ని కింది కి దింపేది లేదంటూ గ్రామస్తులు అక్కడే కూర్చోవడంతో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు మృతదేహాన్ని విద్యుత్ స్తంభం పైనే వేలాడుతూ ఉంది. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకుంది. చివరకు రూరల్ పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు వచ్చి గ్రామస్తులను సముదాయించడంతో మృతదేహాన్ని కిందికి దింపారు. అనంతరం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించా రు. ఆయన భార్య ప్రతిభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ ముజాహిద్ తెలిపారు. కాగా.. పంచాయతీ మోటర్‌కు కరెంట్ సరఫరా కాకపోవడంతో విద్యుత్ స్తంభం ఎక్కినట్లు ఆయన భార్య ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ తెలిపారు.

### స్తంభం ఎక్కిన విషయం తెలియదు

యాపల్‌గూడకు చెందిన మోతీరాం మూడు నెలల కిందట లైన్‌మన్ వద్ద పని చేస్తుండేవాడు. లైన్‌మన్, జూనియర్ లైన్‌మన్‌కు తెలువకుండా మోతీరాం కరెంటు పోల్ ఎక్కి ప్రమదవశాత్తు మృతిచెందాడు. ఈ సంఘటనకు, విద్యుత్‌శాఖకు సంబంధం లేదని ఆదిలాబాద్ రూరల్ అడిషల్ అసిస్టెంట్ ఇంజినీర్ తిరుపతిరెడ్డి తెలిపారు.


మోతీరాం(ఫైల్)
విద్యుత్ స్తంభంపై ఉన్న మోతీరాం మృతదేహం